క్లుప్తంగా

మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు

కొత్తూరు: మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యంత్రీకరణ(శామ్) పథకంలో భాగంగా యాభై శాతం సబ్సిడీపై పలు పరికరాలు, యంత్రాలు అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డులతో వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అర్చక సమాజం కార్యవర్గం ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

షాద్‌నగర్: పట్టణంలోని వీరమహేశ్వరస్వామి అర్చక సమాజం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరమహేశ్వరస్వామి అర్చక సమాజం పట్టణ అధ్యక్షుడిగా అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా కల్యాణ్‌స్వామి, కోశాధికారిగా మఠం ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్‌శాస్త్రి, శివానంద్, ప్రచార కార్యదర్శిగా సంగయ్య, సహాయ కార్యదర్శిగా జంగం సంగమేశ్వర్‌స్వామి, సలహాదారుడిగా సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన పోచమోని రమేశ్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 42 మందికి ఆప్తమాలజిస్ట్ రమేశ్ కంటి పరీక్షలను నిర్వహించారు. వీరిలో 14 మందికి కంటి అద్దాలు, 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి మేనేజర్ భరత్‌రెడ్డి, ఇన్‌చార్జి భరత్, గ్రామస్తులు కుమ్మరి రాజు, నవీన్, షేర్‌ఖాన్, రమేశ్, శంకర్, ఆనంద్ యాదవ్, మల్లేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవను అలవర్చుకోవాలి

యూత్ కాంగ్రెస్ డివిజన్ నాయకుడు నిరంజన్‌గౌడ్



స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానం పెంపొందుతుందని యూత్ కాంగ్రెస్ చేవెళ్ల డివిజన్ నాయకుడు గౌండ్ల నిరంజన్‌గౌడ్ అన్నారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో హైదరాబాద్‌లోని ఏవీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు వేసవి ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి, వీధుల్లో, రోడ్లవెంబడి పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, ఏవీ కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అంజయ్య, గ్రామస్తులు రాజు, మల్లేశ్, రవికుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం



నరేందర్‌రావుతో స్థానిక బీజేపీ నాయకులు

ఆమనగల్లు: బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వేముల నరేందర్‌రావును ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయాన్ని తొలిసారిగా సందర్శించిన ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు యాదగిరి, రవిరాథోడ్, పద్మ ప్రశాంత్, సాయికుమార్, దేవేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?



- అధ్వానంగా నాగిరెడ్డిగూడ-బాకారం రోడ్డు
- గుంతలు, కంకరతేలిన రోడ్లపై వాహనాదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని గ్రామీణ రోడ్లన్నీ గుంతలు, కంకర తేలి అధ్వానంగా మారాయి. దీంతో ఆయా రోడ్లపై వాహనాదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. పలు రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. కొంతమేరకు పనులు చేసి అర్ధంతరంగా వదిలేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు. దీంతో రెండు సంవత్సరాలుగా వాహనాదారులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు పనులను పూర్తిచేసి తమ ప్రయాణ అవస్థలను తీర్చాలని వాహనాదారులు కోరుతున్నారు.

నిధులు మంజూరైన..

మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామం నుంచి బాకారం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు, వాహనాదారులు, వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.1.30కోట్లు సీసీఆర్ నిధులు మంజూరయ్యాయి. దీంతో 2023 ఏప్రిల్ 16న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించిన అధికారులు అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి నాగిరెడ్డిగూడ వరకు రోడ్డు వేశారు. కానీ నాగిరెడ్డిగూడ నుంచి బాకారం రోడ్డు పనులను అర్ధంతరంగా వదిలేయడంతో ప్రయాణికులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. అజీజ్‌నగర్ పాత రోడ్డు నుంచి బాకారం రోడ్డుతో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలు అటు శంషాబాద్, షాబాద్ మండలం, సర్దార్‌నగర్ కలుపుతూ ప్రయాణిస్తున్న వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అర్ధంతరంగా వదిలేసిన రోడ్డును పూర్తి చేయాలని గ్రామస్తులతో పాటు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



బాకారం సమీపంలో రోడ్డు దుస్థితి

నరకయాతన పడుతున్నాం



మండల పరిధిలోని అజీజ్‌నగర్ మొదలుకొని నాగిరెడ్డిగూడ బాకారం రోడ్డు అడుగడుగునా గుంతలుపడి నరకయాతన పడుతున్నాం. అప్పటి ప్రభుత్వంలో అజీజ్‌నగర్ పాత రోడ్డు నుంచి నాగిరెడ్డిగూడ వరకు రోడ్డు పనులు పూర్తిచేశారు. కానీ నాగిరెడ్డిగూడ నుంచి బాకారం రోడ్డు వేయకుండా అలాగే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలి.

– బద్దుల సుధాకర్‌యాదవ్, మాజీ సర్పంచ్, బాకారం

ప్రమాదాలు జరుగుతున్నాయి



నాగిరెడ్డిగూడ–బాకారం రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల పరిధిలోని బాకారం–నాగిరెడ్డిగూడ రోడ్డు గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా రోడ్డు పనులు చేపట్టడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తిచేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.

– కొత్తపల్లి తిరుపతిరెడ్డి, మాజీ వార్డుసభ్యులు, బాకారం

బిల్లులు రాక నిలిపివేశారు

అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి బాకారం వరకు రోడ్డు పనులకు నిధులు మంజూరైన మాట నిజమే. కానీ అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి నాగిరెడ్డిగూడ గ్రామం వరకు రోడ్డు పనులు చేశారు. నాగిరెడ్డిగూడ నుంచి బాకారం వరకు రోడ్డు పనులు చేయకుండా వదిలేసిన విషయం వాస్తవమే. బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. బిల్లులు రాగానే ఈ పనులను ప్రారంభిస్తారు.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలో రూ.30లక్షల నిధులతో విలేజీకి వెళ్లే దారిలో వేసే సీసీరోడ్డు పనులను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో గతంలో సగం వరకు పూర్తిచేసి వదిలేసిన సీసీ రోడ్డు పనులకుగాను నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో పనులు పూర్తవుతాయన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకుగాను ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, యాదగిరి, పెంటయ్యగౌడ్, రాములు, వెంకట్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మహేశ్, నర్సింలు, మానిక్యం తదితరులు ఉన్నారు.

పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్

మొయినాబాద్‌రూరల్: మున్సిపాలిటీకి పన్నులు కీలక ఆదాయ వనరులు కావడంతో అధికారులతో కలిసి వసూలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో పన్నుల వసూలు ప్రక్రియలో భాగంగా ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా పన్నులు ఈ నెల చివరి వరకు చెల్లించాలని లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు తప్పవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల చివరివరకు చెల్లిస్తే ఎలాంటి పెనాల్టీలు ఉండవన్నారు. ఏప్రిల్ 1వ తేదీ చెల్లిస్తే ట్యాక్స్‌కు పెనాల్టీ ఉంటుందని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వందశాతం పన్నుల వసూలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ కమిషన్ ఖాజామొయిజుద్దీన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పన్నులు కట్టాలని వ్యాపారస్తులకు సూచిస్తున్న ఖాజామొయిజుద్దీన్, సిబ్బంది

పట్టపగలే వెలుగులు



బాకారం జీపీ కార్యాలయంపై వెలుగుతున్న వీధి దీపం



ఎస్సీ కాలనీలో వెలుగుతున్న వీధి దీపం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతోనే నిరంతరంగా వెలుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అన్ని గ్రామాల్లో వీధి దీపాలకు గ్రామ పంచాయతీల ద్వారా బిల్లులు వసూలు చేస్తున్నా అధికారులతో పాటు ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. సాక్షాత్తు గ్రామ పంచాయతీ కార్యాలయంపై పట్టపగలు వెలుగుతున్న వీధి దీపమే ఇందుకు నిదర్శనమే అని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

కొత్తూరు మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో పునర్నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయాన్ని ఆయన మంగళవారం సందర్శించి తనవంతు సహకారంగా రూ.5,01,116ల విరాళంను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన అయ్యప్ప ఆలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు గిరిషన్‌నాయర్, లక్ష్మయ్య, కుమార్, చంద్రపాల్‌రెడ్డి, రాంరెడ్డి, ఈట గణేశ్, హరిజీవన్, శ్రీకాంత్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మాదాసి కురువల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మాదాసి కురువల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాద్‌నగర్ మాదాసి, మాదారి కురువ సంఘం తాలుకా అధ్యక్షుడు విఠలయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్సీని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మాదాసి, మాదారి కురువలు ఎస్సీ ధ్రువీకరణ పత్రాల కోసం ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై శాసన మండలిలో ప్రస్తావించి వారి సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి ఐక్యంగా ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్, కోరె రాజు, బండ కుమార్, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



మొయినాబాద్‌రూరల్: హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



షాద్‌నగర్‌రూరల్: హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ప్రవిత్రమైనదని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య, మండల విద్యాధికారి వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మల్లేశం పదవీ విరమణ సందర్భంగా ఉపాధ్యాయురాలు మంగ అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హెచ్‌ఎం దంపతులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా విరమణ సహజమేనన్నారు. ప్రధానోపాధ్యాయుడు మల్లేశం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు నిరంజన్‌గౌడ్, ఎంఎస్‌ఓ మల్లయ్య, మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం అంజనేయులు, ఉపాధ్యాయులు సుధాకర్, నర్సింహులు, రాంచందర్, బందయ్య, వినోద్‌కుమార్, రవికాంత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు భీమ్‌రెడ్డి, బాలరాజ్, ప్రవీణ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న భీష్వ కృష్ణయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై హెచ్‌ఎం దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయమ్మ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటప్ప, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్, నాయకులు భీష్వ రామకృష్ణ, అరుణ, వెంకట్‌రెడ్డి, విష్ణుగౌడ్, వెంకటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ఘనంగా ఇఫ్తార్ విందు

చేవెళ్ల: మున్సిపాలిటీలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం రాత్రి పీఏసీఎస్ చైర్మన్ దేవర సమతవెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు వారు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల దోపిడీని అరికట్టాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: అనుమతులు లేని ప్రైవేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఇంటర్మీడియేట్ విద్యాధికారి భూక్యానాయక్‌కు ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పలు ప్రైవేటు కళాశాలలు విద్యాసంవత్సరానికి ముందే ప్రవేశాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. కోచింగ్, కార్పొరేట్ విద్య అనే మోజులో విద్యను వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నడుపుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా బోర్డు ఆఫ్ ఇంటర్మీడియేట్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆశవర్కర్ల అరెస్టులు అక్రమం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా

కొత్తూరు: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరసన తెలిపేందుకు వెళ్లిన ఆశవర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా అన్నారు. ఆశల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తూ కొత్తూరు పట్టణంలో ఆయన మంగళవారం పలువురు ఆశవర్కర్లతో కలిసి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఎవరికైనా శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. ఆశలు తమ సమస్యలు, డిమాండ్ల సాధనకు కార్యక్రమాన్ని నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేదనే సాకుతో వారిని పోలీసులతో కొట్టించడం హేయమైన చర్య అన్నారు. పోలీసులు చేసిన దాడిలో చాలా మంది ఆశలు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఆశవర్కర్లు, యూనియన్లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశలు జహంగీర్‌బీ, మంజుల, అనిత, మాధవి, లత, లక్ష్మి, ఇందిరా, నవనీత తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నందిగామ: ఆశవర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబా కోరారు. ఆశలను అరెస్ట్ చేసిన సందర్భంగా మండల కేంద్రమైన నందిగామలో పలువురు ఆశవర్కర్లతో కలిసి ఆయన మంగళవారం మహాత్మాగాంధీ విగ్రహానికి ఆశవర్కర్ల డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికై నా ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనట్లయితే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు నవనీత, నీలమ్మ, శిరీష, ప్రమీల, దేవమ్మ, సునీత, రాధ, లక్ష్మి, భూదేవి, అనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత కల్పించాలి

శంకర్‌పల్లి: ప్రపంచ ఆరోగ్య లీడర్లుగా గుర్తించబడిన ఆశవర్కర్లకు సామాజిక భద్రత కల్పించాలని ఆశవర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు నాగమణి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశలు భవాని, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాట్లాడుతున్న సాయిబాబా



శంకర్‌పల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశవర్కర్లు